# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-04-2002, రావులపాలెం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భౌతికంగాకాని, ఆధ్యాత్మికంగాకాని అభివృద్ధిలోనికి రావటానికి ప్రతీవ్యక్తికి ఓర్పు, పట్టుదల, నిగ్రహం ఇవి మూడూ అవసరం. ఓర్పులేనివాడికి ప్రతిస్పందన ఎక్కువ ఉంటుంది. ఓర్పులేనివాడు నిర్మాణాత్మకమైన పనులుచేయలేడు. ఓర్పులేనివాడు చేసేపనులు వాడికుటుంబానికిగాని, సమాజానికిగాని, దేశానికిగాని ఉపయోగపడవు. ఓర్పుఉన్నవాడు, నిగ్రహం ఉన్నవాడు అందరికి ఉపయోగపడే పనులు చేస్తాడు. సర్వసాధారణంగా కత్తికి ఒక ప్రక్కనే పదును ఉంటుంది. ద్వేషంఅనే కత్తికి మాత్రం రెండువైపుల పదును ఉంటుంది. ఒకప్రక్క పదును ద్వేషంఅయితే, రెండోప్రక్క పదును కక్ష. ద్వేషం ఉన్నచోట కక్షకూడా ఉంటుంది. ఎవరిమీద అయితే ద్వేషం ఉందో వారిని హింసించాలనే బుద్ధి మనకు తెలియకుండా వచ్చేస్తుంది. పని మిమ్మల్ని విడిచిపెట్టాలిగాని మీరు పనిని విడిచిపెట్టవద్దు. పని విడిచిపెడితే సోమరితనం వస్తుందిగాని జ్ఞానంరాదు. పనివిడిచిపెట్టటంవలన ఇతరులను పోషించటంమాట అటుఉంచండి, చివరకు మీ శరీరమే మీకు బరువు అవుతుంది. స్వార్ధం లేకుండా పనిచేయటం మనం నేర్చుకోవాలి. సార్ధం లేకుండా పనిచేస్తూ ఉంటే అదిసమాజానికి ఉపయోగపడుతుంది, మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. స్వార్ధంలేకుండా జీవిస్తూఉంటే దేహంగా, మనస్సుగా, అహంభావనగా జీవించటం తగ్గిపోతుంది. మానవుడు తనలో ఉన్న స్వార్ధం కొంచెం తగ్గించుకొంటే ఎన్నో మంచి పనులు చేయవచ్చు. మంచిపనులు చేయగాచేయగా మంచిగా ఉండటం అలవాటు అవుతుంది. హృదయగుహలో ప్రవేశించటానికి మంచితనం మనకు సహకరిస్తుంది.

కర్మను యోగంగాచేయాలి అంటే కర్మఫలం ఆశించకుండాచెయ్యాలి. ఆశించకుండా వచ్చినది మనలను బంధించదు, కోరి తెచ్చుకొన్నది మనలను బంధిస్తుంది, ఆబంధమే పునర్జన్మకు కారణమవుతుంది. నేను మీకు ఎవరికైనా అపకారంచేసాను అనుకోండి తప్పనిసరిగా రాబోయే జన్మలో మీచేత అపకారం పొందుతాను. ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం సంపాదించు. ఇంద్రియనిగ్రహంవలన, మనోనిగ్రహంవలన చిత్తశుద్ధి కలుగుతుంది,





చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే హృదయంలో ప్రవేశించగలము. మనంరోజూ నిద్రపోయేముందు ఈ రోజుఎలా జీవించాము మనపొట్టకోసమే జీవిస్తున్నామా, ఇతరులకు ఉపయోగపడే పనులు ఏమైనా చేస్తున్నామా అని ఏరోజుకారోజు చూసుకోవాలి. మనంఏమైనా సాధనచేస్తున్నామా? మనలను మనం మర్చిపోయి ఇతరులకు ఏమైనా ఉపకారం చేస్తున్నామా అని చూసుకొంటే మనకు మార్కులుసున్నా. ఇంకమనకు ఆత్మజ్ఞానం ఏమి కలుగుతుంది. మనం ఏమాట మాట్లాడినా, ఏ పనిచేసినా, మనకు ఏ తలంపువచ్చినా మనం పవిత్రులవ్వటానికి అది సహకరించాలి. మనలోపల ఉన్న సద్వస్తువు పరమపవిత్రమైనది, దానికి పరిమితులు లేవు, అది స్వేచ్ఛగా ఉంటుంది, ఏకంగా ఉంటుంది, చావుఎలా ఉంటుందో దానికి తెలియదు. దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఈ రోజున మనం నాలుగు మంచిమాటలు వింటున్నాము అంటే మనం పూర్వజన్మలో చేసినసత్కర్మ మనలను ఇక్కడకు తీసుకొనివచ్చింది, మనం సత్కర్మ చేయకపోతే మనం మొఖం ఇటు తిరగదు. మీకు ఏదైనా దు:ఖం వస్తోంది అనుకోండి. ఈ దు:ఖం ఎవరికివస్తోంది? ఈ దు:ఖపడేవాడు ఎవడు? అని మీరు విచారణ చేసుకొంటే ఆ నేను పోతాడు. ఆ నేనుపోతే మీరు పోరు, మీరు ఎవరో మీకు తెలుస్తుంది. అప్పడు ఆనందసాగరంలో, శాంతిసాగరంలో ఊగిసలాడుతారు. నీలోపల సద్వస్తువు ఉంది, నీకు తెలిసినా, తెలియకపోయినా అది నీలోపలే ఉంది. నీ భ్రాంతి వలన, నీబుద్ధిలో ఉన్నదోషంవలన అది నీకు తెలియటంలేదు. నీ భ్రాంతిలోనుండి బయటకురా, దేహాభిమానంలో నుండి బయటకు రా అప్పడు అది నీకు గోచరమవుతుంది.

**ఆత్మ విశ్వాసము మంచిది, కాని ఆత్మహింస మంచిదికాదు**

**- సద్గురు శ్రీ నాన్నగారు**

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 6 నుండి 18-6-02 వరకు | | హైదరాబాదు క్యాంపు |
| 10-6-2002 | సోమవారం | సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటి హాలు, మధురానగర్ |
| 16-6-2002 | ఆదివారం | రమణ కేంద్రం, హైదరాబాదు నల్లకుంట శివం టెంపుల్ దగ్గర |
| 25/26-6-2002 | | చైతన్యతపోవన్ ఆశ్రమం, విజయవాడ-గుంటూరు హైవే మధ్యాహ్నం 4 నుండి 6 గంటల వరకు |
| 04-07-2002 | | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

### సద్గురు శ్రీనాన్నగారు ఛారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయం

(ఆంధ్రభూమి సోమవారం 3 జూన్, 2002)



పోడూరు మండలంలో సద్గురు శ్రీనాన్నగారు ఛారిటబుల్ ట్రస్టు పేద ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆచంట ఎమ్మెల్యే మోచర్ల జోహార్ పేర్కొన్నారు. మండలంలోని జిన్నూరు పంచాయితీ కార్యాలయం వద్ద ఆదివారం 56 మంది వికలాంగులు, వితంతు వులు, పేద విద్యార్థులకు ఛారిటబుల్ ట్రస్టు మంజూరు చేసిన ఉపకార వేతనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ట్రస్టు మరింత అభివృద్ధి చెంది, పేద ప్రజలను మరింతగా ఆదుకోవాలన్నారు. జిన్నూరు సద్గురు శ్రీ నాన్నగారు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా కుల, మత, ప్రాంతీయ భేదం లేకుండా వందలాదిమంది ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సాయం అందిస్తున్నామన్నారు. సర్పంచ్ కలిదిండి విజయలక్ష్మి మండల పరిషత్ అధ్యక్షురాలు గెద్దాడ పద్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సూక్తులు

**ప్రేమలేని జీవితము దేవుడులేని గుడివంటిది**

**- శ్రీ నాన్నగారు**

**కోపమనే అగ్నిని వివేకమనే నీటితో ఆర్పమన్నారు**

**- వాల్మీకి**

**దయగల హృదయమే భగవన్నిలయము**

**-మళయాళస్వామి**

**హృదయశుద్ధిగలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు**

**- బైబిల్**

**ఏ ప్రాణిని ద్వేషింపవలదు. మైత్రి, కరుణ కలిగిఉండవలెను**

**- గీత**

**ఆనందము నీలోనే ఉన్నది, బయట వస్తువులలో లేదు**

**- శ్రీ రమణ మహర్షి**

**దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా,**
**సొంతలాభము కొంతమానుకొని, పొరుగువానికి తోడుపడవోయి**

**- గురజాడ**

**చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు.**

**- మహాత్మగాంధీ**

**విజయమునకు వినయము పునాది**

**- శ్రీ నాన్నగారు**